క్లుప్తంగా

నేడు న్యాయవాదుల నిరసన

హుజూర్‌నగర్ : ఉత్తరప్రదేశ్‌లో న్యాయవాదులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలపాలని హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ పీఆర్‌ఓ కాల్వ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. విధుల బహిష్కరణకు న్యాయమూర్తులు, న్యాయశాఖ సిబ్బంది, ప్రాసిక్యూషన్ తరఫున పోలీసులు, ప్రభుత్వ న్యాయవాదులు సహకరించాలని కోరారు.

యూరియా కృత్రిమ కొరత

నడిగూడెం : మండలంలో యూరియా ఎరువును కృత్రిమ కొరతగా చూపిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు అల్వాల రామారావు ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ సహకార సంఘాలు, ఎరువుల దుకాణాల్లో యూరియా ఉన్నా రైతులకు పంపిణీ చేయడం లేదన్నారు. బ్లాక్‌లో బస్తా రూ.350 లకు పైగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సౌండ్ సిస్టం బహూకరణ


సౌండ్ సిస్టం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండల పరిధిలోని మట్టిగూడెం ఎంపీఎస్ పాఠశాలకు పూర్వ విద్యార్థులు గల్లా వెంకటేశ్వర్లు, గల్లా హనుమంతరావు, గల్లా నాగయ్యలు బుధవారం సౌండ్ సిస్టంను బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నందిపాటి సైదులు మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గల్లా సైదులు, ఎస్‌ఎంసీ చైర్మన్ చిల్లా వీరబాబు, ఉపాధ్యాయులు కళింగరెడ్డి, అరీఫ్, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.50 వేల విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయం ఆవరణలో నిర్మించనున్న కల్యాణ మండపం నిర్మాణానికి సూర్యాపేటకు చెందిన పోలా ప్రదీప్‌కుమార్– రమ్య దంపతులు బుధవారం రూ.50 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భౌరిశెట్టి వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి కేవీఎస్‌ఎన్ గుప్త, వందనపు సూర్యప్రకాష్‌రావు, కొండా దుర్గారావు, జల్లా కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'లో వికలాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలి

మునగాల : గృహలక్ష్మి పథకంలో వికలాంగులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించి ప్రాధాన్యం ఇవ్వాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ కోరారు. బుధవారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వాలు వికలాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ కేటాయించాయని, గృహలక్ష్మి పథకంలో మాత్రం వికలాంగుల రిజర్వేషన్లపై స్పష్టత లేదన్నారు. గృహలక్ష్మి పథకంలో అధికారులు, రాజకీయ నాయకుల జోక్యం లేకుండా కుటుంబ స్థితిగతులను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్, జిల్లా కార్యదర్శి భాష్యం వంశీయాదవ్, నవీన్ ముదిరాజ్, శ్రీకాంత్‌వర్మ, సువర్ణాచారి, కిరణ్, సతీష్ పాల్గొన్నారు.

పాస్టర్లకు వేతనాలు ఇవ్వాలి

మునగాల : హిందూ అర్చకులకు, ముస్లింలకు వేతనాలు ఇస్తున్నట్లు క్రైస్తవ పాస్టర్లకు కూడా ప్రతినెల వేతనాలు ఇవ్వాలని సూర్యాపేట జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ యూత్ కన్వీనర్ జె.జె.సామ్యూల్ సన్ కోరారు. బుధవారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సాధనలో అన్ని సంఘాల మాదిరిగానే ర్యాలీలు, ధర్నాలు చేసి మమేకమయ్యారని గుర్తు చేశారు. మారుమూల ప్రాంతాల్లో క్రైస్తవ విశ్వాసుల ప్రోత్సాహంతో జీవనం సాగిస్తున్న పాస్టర్లకు వేతనాలను ప్రకటించాలని కోరారు. చర్చిల నిర్మాణాలకు, చర్చిఈ గోడల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఉపాధి హామీ పథకాన్ని తొలగించేందుకు కుట్ర

మఠంపల్లి : దేశంలో కోట్లాది మంది గ్రామీణ కూలీల జీవనభృతికి తోడ్పాటునందిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని తొలగించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు ఆరోపించారు. బుధవారం మఠంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధార్ కార్డుతో అనుసంధానమైన జాతీయ ఉపాధి హామీ కూలీలకే సెప్టెంబర్ 1 నుంచి వేతనాలు, చెల్లింపులు ఉంటాయని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ స్పష్టం చేయడం దారుణమైన విషయమని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 1 కోటి 5 లక్షల 70 వేలమంది ఉపాధి కూలీలు ఉండగా, అందులో కేవలం సగం మంది మాత్రమే ఆధార్ అనుసంధానమయ్యారని, మిగతా కూలీల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆధార్‌తో అనుసంధానం చేసుకునేందుకు డిసెంబర్ 31 వరకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి అమరారపు పున్నయ్య, సీనియర్ నాయకులు దాశరథి రామక్రిష్ణ, తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు


బేతవోలు నుంచి చెన్నారిగూడెం వెళ్లే దారిలోని మూలమలుపులో..


బేతవోలులో జనావాసాల మధ్య..

- జనావాసాల్లో ఏర్పాటు
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు

చిలుకూరు : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. బేతవోలు నుంచి చెన్నారిగూడెం వెళ్లే దారిలో మూలమలుపులో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. అలాగే మండల కేంద్రంతో పాటు ఆచార్యులగూడెం, జెర్రిపోతులగూడెం, రామాపురం రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఏర్పాటు చేశారు. బేతవోలు గ్రామంలో జనావాసాల మధ్య ఏర్పాటు చేశారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయలేదు. కొన్నిచోట్ల తక్కువ ఎత్తులో, మరికొన్ని చోట్లు రోడ్ల వెంట ఏర్పాటు చేయడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై అనేక ఏళ్లుగా సంబంధిత అధికారులకు విన్నవించినా వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారుగా 35 ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డు పక్కన జనవాసాల మధ్య, పాఠశాలల పక్కన ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరగుతుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని కోరుతున్నారు.

తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం



మండలంలో కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న మాట వాస్తవమే. బేతవోలు నుంచి చెన్నారిగూడెం, జెర్రిపోతులగూడెంలో వెళ్లే రోడ్డులో దారి పక్కన ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. మండలవ్యాప్తంగా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి వాటికి ఎస్టిమేట్‌లు వేసి తొలగిస్తాం.

– కందరబోయిన సైదయ్య, ట్రాన్స్‌కో ఏఈ, చిలుకూరు

రాష్ట్రాన్ని ఆకుపచ్చగా మార్చిన కేసీఆర్

- కోదాడ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్


సంపద వనంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మునగాల : తెలంగాణ రాష్ట్రాన్ని ఆకుపచ్చగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రం శివారులోని ఎన్‌ఎస్‌పీ కాలువ కట్టపై ఏర్పాటు చేసిన సంపద వనంలో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. హరితహారం అనే మహోన్నత కార్యక్రమంతో తెలంగాణలో అటవీ శాతం, గ్రీనరీ పెరిగిందన్నారు. అనంతరం పలువురు మహిళాప్రతినిధులు, మహిళా ఉద్యోగులు, ఎమ్మెల్యేకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సుంకర అజయ్‌కుమార్, ఎంపీపీ ఎలక బిందు, బీఆర్‌ఎస్ నాయకులు కందిబండ సత్యనారాయణ, ఎలక నరేందర్‌రెడ్డి, యుగరంధర్ రెడ్డి, ఎల్‌పీ.రామయ్య, పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, ఉడుం కృష్ణ, గొని శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, నాగబాబు, శ్రీనివాస్, ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, సర్పంచ్ ఉపేందర్, అధికారులు, ఫీల్డ్ అసిస్టెంటు కృష్ణవేణి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

- ఆర్డీఓ జగదీశ్వరరెడ్డి


హుజూర్‌నగర్ : విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వరరెడ్డి


నేరేడుచర్ల : ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సైదులు

హుజూర్‌నగర్ : 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని ఆర్డీఓ జగదీశ్వరరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన ఓటర్ల నమోదు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఓటు నమోదుకు గవర్నమెంట్ కాలేజ్ క్యాంపస్ అంబాసిడర్లుగా యాకూబ్ పాషా, శిరీషలను నియమించారు. కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు, ఆచార్యులు, ఎన్నికల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాయకులతో సమావేశం..

అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చనిపోయిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని కోరారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ప్రతి బుధవారం సమావేశం ఉంటుందని నూతన ఓటు నమోదుకు సహకరించాలని అన్నారు. అధికారులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన

నేరేడుచర్ల : 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ అక్టోబర్ 1వ తేదీలోగా ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.సైదులు అన్నారు. నేరేడుచర్లలోని స్పందన జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటు నమోదుపై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌లో, ఎన్నికల సంఘం యాప్, బీఎల్‌ఓలను సంప్రదించి ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెట్ కట్టా ప్రవీణ్‌రెడ్డి, అధ్యాపకులు ఆంజనేయులు, శ్రీధర్, సతీష్, చారి తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు


మఠంపల్లి : లాలితండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో రాఖీలు కడుతున్న చిన్నారులు


చిలుకూరు : గ్లోబస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో..

మఠంపల్లి : మండలంలోని లాలితండాలో గల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రాఖీలు కట్టుకుని అలరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోతు బోడీ రమేష్‌నాయక్, బీఎల్‌ఓ రంజాన్‌బీ, భూక్యా బాలునాయక్, మట్టపల్లినాయక్, తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండల కేంద్ర పరిధిలోని గ్లోబస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బుధవారం రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో రాఖీలు కట్టించి పండుగ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ఉపేందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

గరిడేపల్లి : తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండు రాంబాబుగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం గరిడేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో పాఠశాలల్లో విద్యను బోధించడానికి సరిపడా ఉపాధ్యాయులు లేక గత 9 ఏళ్లుగా పేద విద్యార్థులు చదువులో వెనుకబాటు తనానికి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రతి సబ్జెక్టుకు ఒక టీచర్‌ను నియమించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించి, విద్యార్థులకు మంచి భోజనం అందించాలన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం


నేరేడుచర్ల : మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ చత్రునాయక్


మునగాల : విద్యార్థులకు సూచనలిస్తున్న ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఆజాంబాబా

నేరేడుచర్ల : క్రీడలతో శారీరకదారుఢ్యం పెంపొందడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని మండల విద్యాధికారి పి.చత్రునాయక్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఎల్. శ్రీనివాస్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటప్పయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయడు వాసా గోవర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అండర్– 14, అండర్– 17 ఖోఖో, వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఎనిమిది పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు హాజరైనట్లు స్కూల్ గేఫ్ ఫెడరేషన్ సెక్రటరీ ఆజాంబాబా తెలిపారు. పోటీల్లో విజేతలైన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు.

1, 2 తేదీల్లో క్రీడలు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 1, 2 తేదీల్లో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి చత్రునాయక్, ప్రధానోపాధ్యాయుడు ఎం.సువర్ణ, మండల క్రీడల నిర్వాహకులు ఎస్.యాదయ్య బుధవారం తెలిపారు. బాల బాలికలకు అండర్– 14, అండర్– 17 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనాలని కోరారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా బుధవారం బాలురకు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. 1వ తేదీన ఖోఖో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు పీఈటీలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

2, 4 తేదీల్లో మండల స్థాయి క్రీడలు

మఠంపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు(పీడీ, పీఈటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీడీ నాగమణి మాట్లాడుతూ సెప్టెంబర్ 2న మఠంపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బాలికలకు, సెప్టెంబర్ 4న పెదవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలురకు వాలీబాల్, కోకో, కబడ్డీ, అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ మన్నెం సీతారామిరెడ్డి, పీఈటీలు వి.మైసయ్యగౌడ్, వెంకటేశ్వర్‌రావు, ఉపేందర్‌రెడ్డి, వీరస్వామి, నాగరాజు, జయ, విజయలక్ష్మి, తరుణ్‌రెడ్డి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు అందజేత


నేరేడుచర్లలో మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రోడ్డు వెంట ఉన్న అనాథ మహిళలు, చిన్నారులకు సాయి సిరి సూపర్ మార్కెట్ సౌజన్యంతో ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, శంకరాచారి, దుర్గారావు, రవి, యశ్వంత్ తదితరులు ఉన్నారు.

బీజేపీ తప్పుడు మాటలు నమ్మొద్దు

తుంగతుర్తి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో స్థానిక ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌కు సంబంధం లేని విషయాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వీటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మూడో సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా గాదరి కిశోర్‌కుమార్‌ను ప్రకటించినందున సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ సెప్టెంబర్– 1న తుంగతుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్‌ఎస్ నాయకులు దొంగరి శ్రీను, కటకం వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, రమేష్, పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, తదితరులు

మఠంపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న టీచర్లు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలపై కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఆగస్టు 18న అంగన్‌వాడీ సంఘాలకు ఐసీడీఎస్ మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, హామీల అమలు కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్ రన్మియా, టీఎస్ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జి.లింగమ్మ, ఆర్.సంతోషి, కార్యవర్గ సభ్యులు, వీర జానకి, ధనమ్మ, దేవి, నరసమ్మ, శోభ, మహాలక్ష్మి, సీహెచ్.శోభ, తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి


మఠంపల్లి : యాతవాకిళ్లలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జానకిరాములు


హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ మేనేజర్ యాకుబ్ పాషా


నడిగూడెం : శ్రీరంగాపురంలో..

మఠంపల్లి : సమాజంలో నెలకొన్న రుగ్మతలను ఎదుర్కొనేందుకు ప్రతిఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ జానకిరాములు, సర్పంచ్ కె.లక్ష్మీనరసింహరాజు కోరారు. బుధవారం మండలంలోని యాతవాకిళ్ల దళిత కాలనీలో పౌరహక్కులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుజిత్ కుమార్, ఏపీఓ ఉమాదేవి, ఏపీఎం సౌజన్య, పీఎస్‌లు నాగిరెడ్డి, సైదులు, నాగయ్యయాదవ్, స్థానికులు పాల్గొన్నారు.

దళితులపై వివక్ష చూపితే చర్యలు

నడిగూడెం : మండల పరిధిలోని శ్రీరంగాపురం ఎస్సీ కాలనీలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ టి.నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో దళితల పట్ల వివక్ష చూపవద్దన్నారు. చిన్నచూపు చూపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీఓ ఎర్ర.లింగారెడ్డి, సర్పంచ్ నాగేశ్వరరావు, కార్యదర్శి ప్రత్యూష, ఏపీఎం రామలక్ష్మి, వార్డెన్ ముత్యాలరావు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలి

హుజూర్‌నగర్‌రూరల్ : రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మట్టిగూడెంలో గల దళితవాడలో రాజ్యాంగ హక్కులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ గల్లా సైదులుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మట్టిగూడెంలో 8 ఎకరాల భూమిని కొనుగోలు చేసి నిరుపేదలైన దళితులకు పంపిణీ చేసిందన్నారు. సమాజంలో ఎవరైనా కుల వివక్షకు గురైతే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.నాగార్జునరెడ్డి, ఎంపీఓ లావణ్య, డిప్యూటీ తహసీల్దార్ సుధా, ఆర్ఐ షరీఫ్, ఏఎస్ఐ బలరాంరెడ్డి, కార్యదర్శి, వార్డుసభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పౌర హక్కులను గౌరవించాలి

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ పౌర హక్కులను గౌరవించాలని మున్సిపల్ మేనేజర్ యాకుబ్ పాషా అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని 2వ వార్డు మల్లన్ననగర్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జక్కుల శంబయ్య, ఎస్సీ హాస్టల్ వార్డెన్ రమేష్, సీనియర్ అసిస్టెంట్ రంగారావు, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ


నేరేడుచర్ల : క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న ఓజో ఫౌండేషన్ సభ్యులు


మఠంపల్లి : విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న పఠాన్ హాఫీజ్‌ఖాన్

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం ఓజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ ఫౌండేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న క్రీడా దుస్తులు అందజేశారు. అనంతరం ఇటీవల ఎస్ఐ ఉద్యోగాలు సాధించిన గ్రామానికి చెందిన నన్నెపంగ వినయ్, మల్లు సంజీవరెడ్డిలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, కట్ట మాధవి, ఉపాధ్యాయులు శ్రీదేవి, కోటిరెడ్డి, విజయ్‌కుమార్, అజయ్‌కుమార్, శ్రీనివాస్, యాదగిరి, సఫియా, షబినా, ఓజో ఫౌండేషన్ సభ్యులు నాగులుమీరా, అమీర్, సైదులు తదితరులు ఉన్నారు.

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్థానిక మజీద్ కమిటీ చైర్మన్ పఠాన్ హాఫీజ్‌ఖాన్ తన తండ్రి పీఏసీఎస్ చైర్మన్ దివంగత పఠాన్ హుస్సేన్‌ఖాన్ జ్ఞాపకార్థం బుధవారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పఠాన్ జానీబీ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో బుధవారం కోదాడ పరిధిలో గల కేఎల్‌ఆర్ ఎస్టేట్‌కు చెందిన షేక్ అన్వర్ పాషా– షబనా దంపతుల కుమార్తె శారియ అజ్రా పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు డా.వేమూరి సత్యనారాయణ, డా.నరాల రుక్మారావు, అన్నదాన దాతలు, ఆశ్రమ నిర్వాహకురాలు విజయమ్మ, లాల్ పాల్గొన్నారు.

కేసీఆర్‌వి మాయమాటలు

మునగాల : రైతులకు రుణమాఫీ జరుగకపోగా రుణభారం పెరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మండవ చంద్రయ్య తెలిపారు. బుధవారం ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతులకు రూ.లక్ష రుణాన్ని మాఫీ చేస్తున్నానని, రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నామని మాయమాటలు చెప్పి ప్రజలను మోసగిస్తున్నారన్నారు. రుణమాఫీ జరగకపోగా రుణభారం పెరిగిందన్నారు.

బీఎస్పీ నాయకుల ముందస్తు అరెస్టు


నేరేడుచర్ల : అరెస్టయిన బీఎస్పీ నాయకులు

నేరేడుచర్ల : డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య అక్రమ అరెస్ట్‌కు నిరసనగా బుధవారం సూర్యాపేటలో జరిగే ధర్నాకు తరలివెళ్లనున్న బీఎస్పీ నాయకులను నేరేడుచర్ల పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరెస్టులతో అణగతొక్కాలని చూస్తూ ఉప్పెనలా లేవడం ఖాయమన్నారు. అరెస్ట్ అయిన వారిలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాపోలు నవీన్, పట్టణ అధ్యక్షుడు కర్రి సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నాగార్జున తదితరులు ఉన్నారు.

మేళ్లచెరువు : సూర్యాపేట బీసీ నాయకుడు వట్టె జానయ్యయాదవ్‌కు మద్దతుగా బుధవారం సూర్యాపేటకు బయలు దేరిన బీఎస్పీ నాయకులను పోలీసులను ముందస్తుగా ఆరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు మంద రవి మాట్లాడుతూ బీసీ నాయకుడు ఎమ్మెల్యే అవుతాడని అతనిపై 70 కేసులు పెట్టించిన మంత్రి జగదీష్‌రెడ్డికి పతనం ప్రారంభమైందన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి


సీఐటీయూలో చేరిన ఆశ వర్కర్లతో జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ

మునగాల : ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాంపంగు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల 22 మంది ఆశ వర్కర్లు సీఐటీయూ సంఘంలో చేరినట్లు ఆయన తెలిపారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం నెలకు రూ.18వేలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు జంగంపల్లి సాయికుమార్, ఆశ వర్కర్లు భాగ్యలక్ష్మి, సుధారాణి, నాగమణి, రమణ, అరుణ, భారతి, మేరమ్మ, నాగమణి, షఫీ, ఉష, మయూరి పాల్గొన్నారు.

భద్రయ్యకు నివాళి

చిలుకూరు : సీపీఐ సీనియర్ నాయకుడు గుంజా భద్రయ్య ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం చిలుకూరు మండల పరిధిలోని బేతవోలులో నిర్వహించిన గుంజా భద్రయ్య సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోరండ్ల మట్టయ్య, తాళ్లూరి పెద మల్లయ్య, బెజవాడ నాగయ్య, బెజవాడ శ్రీనివాస్, సీతారాములు, వెంకయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.